నగరంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రారంభోత్సవాలు

32 డివిజన్లో స్థానికులు ఆయనకు ఘన సన్మానం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలోని 32 డివిజన్లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభోత్సవాలు చేశారు. సిద్ధార్థ నగర్, మౌర్య గార్డెన్స్ ప్రాంతాలలో 34 లక్షల రూపాయలతో నిర్మించిన రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానికులు ఆయన్ను ఘనంగా స్వాగతం పలికారు. పుష్పమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఉసిరికల ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ తాము కోరిన వెంటనే మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పేరు స్వామికి అభినందనలు తెలిపారు. గతంలో తమ ప్రాంతంలో అనేక ఇబ్బందులతో సతమతమయ్యేవారమని అన్నారు. వీధి దీపాలు లేక రాత్రి సమయాలలో మహిళలు విద్యార్థులు అవస్థలు పడేవారన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ స్పీకర్ గోలగట్ల వీరభద్ర స్వామి దృష్టికి తెచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి చొరవ చూపించారని అన్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేసి తమ ప్రాంతం కాంతిమయం చేశారని అన్నారు. అలాగే ప్రస్తుతం 34 లక్షల రూపాయలతో బీపీ రహదారిని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. నగరంలోని అనేక ప్రాంతాలను అభివృద్ధిని చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ప్రధాన జంక్షన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, స్థానిక కార్పొరేటర్ భోగాపురం లక్ష్మి, జోనల్ ఇన్చార్జిలు రెడ్డి గురుమూర్తి, మారెం బాల బ్రహ్మారెడ్డి, వైసీపీ నాయకులు భోగాపురం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి సిరిమాను చెట్టు పూజకు పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర ఇళవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టుకు నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో పూజలు చేయడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పైడితల్లి అమ్మవారు పూజారికి కలలో కనిపించి చెప్పడంతో సిరిమాను చెట్టుకు ముందుగా బొట్టు పెట్టి పసుపు కుంకుమలు సమర్పించి పూజారి బంటుపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంటగా పుట్టిన 15 అడుగుల చింతచెట్టును పైడితల్లి అమ్మవారు పూజారికి కలలో సూచిస్తారు. ఈ క్రమంలోనే సిరిమాను చెట్టు తరలింపు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జరజాపుపేటలో ఈ చెట్టును అమ్మ వారు సూచించడంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేవు. ప్రతి ఏటా దసరా తరువాత వచ్చే మంగళవారం పైడితల్లి అమ్మ వారి సిరిమానోత్సవం జరుగుతుంది. దీంతో నెలరోజుల ముందు నుంచే విజయ నగరంలో పండుగ వాతావరణం నెలకుంటుంది. అక్కడ నుంచి పట్టుకొచ్చిన చింతమానును విజయనగరం పట్టణ పరిధి హుకుంపేటలో ఉన్న వండ్రంగులు సిరిమానుగా మారుస్తారు. ఈ సమయంలోనే హుకుంపేటలోనే అమ్మవారికి మొక్కులు చెల్లించడం చింతమానును సిరిమానుగా మార్చడంలో నీళ్లు, పసుపు రాస్తూ సహాయం చేస్తారు. పూజా కార్యక్రమంలో ఎసి సుధారాణి, పైడితల్లి అమ్మవారి దేవాలయం ట్రస్టు సభ్యులు, నెల్లిమర్ల నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎస్.కోట పట్టణంలో 8 కేజీల గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితులు రిమాండుకి తరలింపు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తుల నుండి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎస్.ఐ. తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో శనివారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో సీఐ ఎస్.ధర్మారావు, స్టేషన్ సిబ్బంది, ఎస్.కోట పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన దాడిలో మధ్యప్రదేశ్ కు చెందిన విక్కీ, రాధేశ్యామ్ అను ఇద్దరు వ్యక్తుల నుంచి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకి తరలించామని చెప్పారు. కాగా తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, వీఆర్వోలు కన్నయ్య, రమణ సమక్షంలో నిందితులు నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ తారకేశ్వరరావు వివరించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పప్పుదినుసులు పంపిణీ

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అవరణలో సహృదయ ఫౌండేషన్ (యుఎస్ఎ) ఆర్థిక సహాయంతో, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బిందు తాడివాక సహకారంతో, ఆశయ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి న్యూట్రీషన్ పంపిణీ చేసారు. ఈరోజు 20 కుటుంబాలకు 700 విలువగల న్యూట్రీషన్ ఆహారమైన బెల్లం, కందిపప్పు, గోధుంపిండి,రాగులు, శనగపలుకులు, పెసలు,సబ్బులు, పంపిణీ చేసారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డా॥ చండిప్రియ పాల్గొన్ని మాట్లాడుతూ కష్టాల్లోవున్న వారిని అదుకోవాడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషం అన్నారు. అశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ సాటి మనిషిని అదుకోవడం మానవ జన్మ వరంగా భావించాలని సహాయం చేసే గుణం ప్రతి ఒకరిలో వుండాలని అలాగే మీ ఆరోగ్యంగా జీవించాలని మనుషులలో మానవత్వాన్ని తీసుకురావడాని మా సంస్థ అనేక కార్యక్రమాలను చేపడతామని అలాగే మాకు సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు అన్ని ఇంకా సహకరిస్తే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ కమ్యూనిటీ కేర్ సెంటర్ మేనేజర్ ఎం.పద్మావతి. ఆశయసంస్థ సెక్రటరీ యం. లక్ష్మణరావు,లక్ష్మణరావు పాల్గొన్నారు.

నూతన సచివాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గంట్యాడ: మండలం పెది మజ్జిపాలెం గ్రామంలో నూతనముగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్ సచివాలయ వ్యవస్థలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుస్థిర స్థానం సంపాదించారన్నారు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ప్రతి పేదవాడిని ఆర్థికంగా ఆదుకునేందుకే సంక్షేమ పథకాలను పక్కాగా ప్రజలకు అందజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్ జడ్పిటిసి సభ్యులు వర్రీ నరసింహమూర్తి పార్టీ కార్యవర్గ సభ్యులు బీవీ ప్రబోజీ మండల పార్టీ అధ్యక్షులు రంది రామనాయుడు జె సి ఎస్ కన్వీనర్ సిహెచ్ రామ సూర్యం పెద్దమధ్యపాలెం ఎంపీటీసీ ఎర్ర అప్పారావు సర్పంచ్ కొంచాడ సన్యాసినాయుడు పిఎసిఎస్ అధ్యక్షులు వ్యవసాయ సలహా మండలి సభ్యులు సచివాలయ సిబ్బంది కన్వీనర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో

పలు పత్ర ద్రావణం తయారీ విధానం

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో సోమలింగపురం యూనిట్, భగీరథపురం, గాతాడా గ్రామంలో రైతులు, మహిళా సంఘాల సభ్యులతో, సామూహికంగా, చీపురుపల్లి-సబ్ డివిజన్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ (ఎన్ఎఫ్ఎంటి) ఆధ్వర్యంలో పలు పత్ర ద్రావణం తయారు చేయడం జరిగింది. తయారీ విధానం రైతులుకు అందుబాటులో ఉండే, ప్రకృతి వనరులతో, ఒక 200లీ. డ్రమ్ములో 25 రకాల ప్రకృతి లో సహజంగా లభ్యమయ్యే ఆకులు అనగా వేపాకు, జిల్లెడు, ఆముదం, నల్లేరు, గన్నేరు, ఉమ్మెత్త, వావిలాకులు, తూటికాడ, బొప్పాయి, వెదురు, సూపర్ నేపియర్ గడ్డి, జామ మొదలైన 20 కేజీలు, ఆకులన్నింటినీ చిన్న, చిన్న ముక్కలుగా చేసి వెయ్యాలి. తరువాత నీరు పొయ్యాలి.1కేజీ పచ్చిమిర్చి,1కేజీ వెల్లుల్లి ఒక 1 కేజీ పొగాకు పేస్ట్ గా తయారీ చేసి, కలయ బెట్టాలి, ప్రతిరోజు ఉదయం , సాయింత్రం ఒక కర్ర సహాయంతో కలయ బెట్టాలి. ఇలా 5-7రోజులు మురిగినట్లాయితే లిపలు పత్ర ద్రావణంలి తయారు అవుతుందని ఆయన వివరించారు.దీనిని అన్ని రకాల పంటలకు, ఉపయోగించవచ్చు. ఈ ద్రావణం పంట పెరుగుదలకు, గ్రోత్ ప్రమోటర్ గా, అన్ని రకాల పురుగుల / తెగుళ్ల నివారణకు అదేవిధంగా పంటకు కావలిసిన పోషకాలు కొరకు, ఉపయోగపడుతుంది. దీనిని 10లీ. నీటికి 1పలు పత్ర ద్రావణం వేసి పిచికారీ చెయ్యాలి...ఈ యొక్క కార్యక్రమంలో రైతులు, మండల యాంకర్, అప్పల నాయుడు, రాము, కళావతి, లోకేశ్వరి, సత్యనారాయణ వి ఎ ఎ వెంకటరావు, తదితర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

తండ్రీ కొడుకులకు గాయాలు

విశాలాంధ్ర-జామి : మండల కేంద్రమైన జామిలో కొట్టాం కి వెళ్లే రహదారిలో విశాఖ పాలకేంద్రం సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు తీవ్రంగా గాయాలు పాలయ్యారు. ఉదయం కొట్టాం నుంచి జామి వైపు మోటార్ సైకిల్ పై వస్తున్న ఎం. పైడిమ నాయుడు, ఎం. శ్రీనులు జామి నుంచి కొట్టాం వైపు వెళ్తున్న ఆటోను బలంగా ఢీ కొట్టడం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రి కొడుకులు అయినా పైడిమనాయుడు, శ్రీనులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కు సమాచారం అందించగా ఈఎంటి సి హెచ్. ఎస్. నాయుడు, పైలట్ ఎన్. ఎల్లారావులు వారికి ప్రథమ చికిత్స చేసి అనంతరం విజయనగరంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

లోకం మాధవి ఆధ్వర్యంలో వైసిపి కుటుంబాలు

జనసేన పార్టీలో చేరిక

విశాలాంధ్ర-డెంకాడ : డెంకాడ మండలంలోని సింగవరం గ్రామంలో లోకం మాధవి ఇంటింటికి జనసేన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సింగవరం గ్రామానికి చెందిన మహిళలు లోకం మాధవిని ఘనంగా స్వాగతించారు. గ్రామంలోని ప్రతి గడపగడపకి తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభుత్వానికి ఒక్క అవకాశం ఇవ్వాలని అలాగే వైసిపి ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సింగవరం గ్రామంలో పర్యటిస్తున్న లోకం మాధవి దగ్గరికి అనేక సమస్యలు వచ్చాయి వాటిలో గ్రామంలో అధికంగా ఉన్న నీటి సమస్య, శుభ్రంగా లేని పారిశుధ్యం,ఊరిలో దయనీయ స్థితి లో ఉన్న కాలువల వలన ప్రజలు అవస్థలకి గురవుతున్న గ్రామస్థుల గురించి మాధవి దృష్టి కి వచ్చాయి. అలాగే సింగవరం గ్రామానికి చెందిన వై.సి.పీ నాయకులు దాడిశెట్టి శ్రీనివాసు వారి అనుచరులు మరియు గ్రామానికి చెందిన మహిళలు లోకం మాధవి ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలకి చెందిన వారు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో జాయిన్ అయిన మహిళలు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్ల నుండి మాధవి సహాయ సహకారాలు, మంచి మనసు చూసి, పేదవాడు ఎప్పటికైనా పెద్దవాడు కావాలనే మనస్తత్వం ఉన్న ఆవిడని చూసి జనసేన పార్టీలోకి జాయిన్ అయినట్టు తెలియజేశారు. లోకం మాధవి పార్టీలో జాయిన్ అయిన మహిళలను ఉదేశిస్తూ మాట్లాడుతూ తాము అందరం ఒక కుటుంబం అని, సింగవరం గ్రామం తనకు సొంత గ్రామం అని ఎన్నో ఏళ్ల నుండి ఈ గ్రామ ప్రజల సహకారం తమకి వస్తూ ఉందని, దానికి ఎంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి జనసేనని అధికారంలోకి తీసుకుని రావాలనికోరారు. ఈ కార్యక్రమంలో మహంతి మురళి పిట్టా చిరంజీవి దాడిశెట్టి శ్రీనివాస్ నడుపూరు రాము, పిట్టా పార్వతి మరియు గ్రామ జనసైనికులు పాల్గొన్నారు.

గ్రంధాలయాలతోనే విజ్ఞానం

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ విని యోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్థానిక గ్రంధా లయ అధికారి సి.హెచ్ కృష్ణ మూర్తి కోరారు.ఆదివారం తెర్లాం శాఖా గ్రంధాలయం లో చదవడం మాకిష్టం అనే కార్ర్యమాన్ని నిర్వహించడం జరిగింది. పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం వస్తుందన్నారు. గ్రంధాలయంలో కళలు, కథలు ,పుస్తకాలు మరియు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు కూడా ఉన్నాయి.విద్యార్థి, విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమానికి విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు...

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో

సిఐ జై భీమ్ యువతకు పిలుపు

విశాలాంధ్ర-బొబ్బిలి: గంజాయి ఇతర మత్తు పదార్థాలు రహిత సమాజం కోసం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ జైభీమ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్, ఆధ్వర్యంలో లో రామభద్రపురం హైవే వద్ద సిబ్బంది వాహన తనిఖీలు నిర్వ హించారు. ప్రత్యేకించి ఒడిస్సా రాష్ట్రం నుంచి సాలూరు మీదుగా వచ్చే వాహనాలలో గంజాయి ఇతర డ్రగ్స్, నాటుసారా మరియు అక్రమ మద్యం లాంటి నిషేధిత పదార్థాలు రవాణా జరుగకుండా నిరోదించేందుకు ప్రతీ వాహనాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందని, ఇటువంటి తనిఖీ లకు వాహన దారులందరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డిపార్ట్మెంట్ వారికి సహకరించాలని సీ.ఐ. జైభీమ్ కోరారు.

వరి పంటకు గండం

- వర్షాలు పడకపోగా పెరిగిపోతోన్న సూర్యతాపం
- బీటలు వారిపోతున్న మెట్టు వరిపొలాలు
- ఆందోళనలో రైతన్నలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలో గత మూడు వారాలుగా వర్షాలు పడకపోవడం రోజురోజుకి సూర్యప్రతాపం విపరీతంగా పెరిగి వరి పంటకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదముందని మండల రైతాంగం ఆందోళనకు గురవుతోంది.ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అడపా దడపా వర్షాలు పడుతున్నప్పటికి పెద్దగా భారీ వర్షాలు పడక అన్ని చెరువులు నిండని పరిస్థితి. దాంతో ప్రస్తుతానికి పల్లపు ప్రాంతాల్లోని చెరువుల్లో కాస్తో కూస్తో నీరు ఉండడంతో అక్కడి వరి పొలాలు బాగున్నప్పటికి మెట్టు ప్రాంతాల్లోని చెరువులు అడుగంటిపోవడంతో వరి చేలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. వరిపొలాలు నిరులేక నేల బీటలు వారిపోయే దుస్థితిలో ఉంది. వరుణుడు కరుణించి సకాలంలో పుష్కలంగా వర్షాలు పడకుంటే మెట్టు పొలాలతో పాటు పల్లపు ప్రాంతాల్లోని వరి పంట కూడా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది.ఇప్పటికే మండల రైతాంగం వరి సాగు కోసం లక్షలాది రూపాయల పెట్టుబడి కూడా పెట్టి పంట పుష్కలంగా పండే తరుణంలో పడాల్సిన వర్షాలు వెనుకడుగు వేసే పరిస్థితిలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వపరంగా సకాలంలో వరి విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించడం వర్షాలు సకాలంలో పడడం వల్ల ఈ ఏడాది వరి పంట పుష్కలంగా పండుతుందని భావించిన రైతాంగం ప్రస్తుత పరిస్థితులు పట్ల దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరి వరుణుడు కరుణిస్తాడో లేదో వేచి చూడాల్సిందే.

దసరా సెలవులలో ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ వద్దు

యుటిఎఫ్ ఆఫీసు బేరర్ల సమావేశంలో డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: సెకండరీ గ్రేడ్ (ఎస్జిటిలు) టీచర్లకు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ (రెండవ విడత) దసరా శెలవులలో వద్దని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.రమేష్, ఎస్. మురళీమోహన్ రావులు సర్వశిక్ష అభియాన్ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక చర్చి వీధిలో గల వేదాంత జూనియర్ కళాశాలలో ఆదివారం యుటిఎఫ్ ఆఫీసు బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే అనేక ట్రైనింగ్ లను పని దినాలలో ఇచ్చి విద్యాబోధనను హరించివేస్తున్నారన్నారు. దసరా పండుగ రాష్ట్ర పండుగగా ఉందని, ఈ పండుగను అందరూ జరుపుకుంటారని కావున ఎట్టి పరిస్థితులలో ట్రైనింగ్ దసరా సెలవులలో అంగీకరించమని అన్నారు. ఎస్ఎస్ఎ అధికారులు తేదీలను మార్చని యెడల ట్రైనింగ్ ను బహిష్కరించాలని ఉపాధ్యాయులకు జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం కోరింది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10వ తేదీ మంగళవారం సాయంకాలం 5 గం.కు పార్వతీపురం డిఈఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని దీనిని జయప్రదం చేయవలసినదిగా ఉపాధ్యాయులు, కెజిబివి టిచర్లు, సిఆర్పీలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను యుటిఎఫ్ జిల్లా శాఖ కోరింది. దసరా సెలవులలో ట్రైనింగ్ ఇవ్వకూడదని, ఉపాధ్యాయులు, కెజిబివి టిచర్లు, సిఆర్పీలు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది జీతాలను వెంటనే చెల్లించాలని, పాఠశాలల గ్రాంట్స్ వెంటనే విడుదల చేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు.

బాబు విడుదలకై సర్వత్రా ఎదురుచూపులు : చిరంజీవులు

విశాలాంధ్ర-పార్వతీపురం: బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటంకోసం మేముసైతం నిరసన రిలేదీక్షలు గతనెల రోజులుగా జోరందుకున్నాయని, నేడు సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చే తీర్పుకోసం సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని, తీర్పులు బాబుకు అనుకూలంగా రావడం ఖాయమని మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.నియోజకవర్గ కేంద్రంలో, వివిధ గ్రామాల్లో టీడీపీ నేతలు,నాయకులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు కలిసి పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొని వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు.టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుకు బెయిల్ మంజూరుచేయాలని, తక్షణమే విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన అక్రమ కేసులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.రిమాండ్ పొడిగింపుతో ప్రజల్లో ఆందోళన పెరుగుతుందని, నేడు సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులు వల్ల విడుదల కావడం ఖాయమని తెలిపారు.ఆరు నెలల్లో సైకో జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.టీడిపి జన సేన సమన్వయంతో రానున్న ఎన్నికలలో వైఎస్సార్సీపీ క్లీన్ స్వీప్ కావడం ఖాయమని తెలిపారు.

పార్వతీపురంలో కొనసాగుతున్న టీడీపి నిరసన దీక్షలు

హాజరైన జగదీష్, శ్రీదేవి తదితరులు

విశాలాంధ్ర-పార్వతీపురం: బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం నిరసన రిలే దీక్షలు గత నెల రోజులుగా నియోజకవర్గ కేంద్రంలో, వివిధ గ్రామాల్లో టీడీపీ నేతలు,నాయకులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు కలిసి నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని స్వీట్ ఇండియా ప్రక్కన ప్రధాన రహదారికు అనుచరించి ఏర్పాటు చేశారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, పట్టణ, గ్రామీణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహనరావు, సీతానగరం పార్టీ ప్రెసిడెంట్ కొల్లి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల్, తదితర టీడీపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, మహిళలు కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. మచ్చలేని టీడీపి అధినేత చంద్రబాబునాయుడుకు బెయిల్ మంజూరుచేయాలని, తక్షణమే విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన అక్రమ కేసులను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తంచేశారు.రిమాండ్ పొడిగింపుతో ప్రజల్లో ఆందోళన పెరుగుతుందని తెలిపారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి జైలులో చంద్రబాబుకు తగినభద్రత లేదన్నారు.సైకో జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.టీడిపి జనసేన సమన్వయంతో రానున్న ఎన్నికలలో వైఎస్సార్సీపీ క్లీన్ స్వీప్ కావడం ఖాయమని తెలిపారు.సోమవారం(నేడు) ఇవ్వనున్న తీర్పు చంద్రబాబుకు అనుకూలంగా రావడం ఖాయమని తెలిపారు. నేటి తీర్పు కోసం దేశమంతా ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారన్నారు.ఈదీక్షా కార్యక్రమంలోగొట్టాపు వెంకటనాయుడు, కోలా వెంకటరావు,కోల మధుసూదన్ రావు,కోల సరిత,బడే గౌరునాయుడు, పాలకొండ రాజశేఖర్,హనుమంత శంకర్రావు, మరిశర్ల కార్తీక్ నాయుడు, కెంగువ ప్రదీప్ కుమార్,చంద్రక దేశాలు గేదెల రామారావు,రాగోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మరిపివలసలో నిరసన దీక్ష

హాజరైన జగదీష్, బేబీనాయన, విజయ్ చంద్ర, చిరంజీవులు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని మరిపివలస గ్రామంలో బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం నిరసన కార్యక్రమంను శనివారం రాష్ట్ర రహదారి ప్రక్కన ఏర్పాటుచేశారు. టీడీపి నియోజకవర్గ పార్వతీపురం, బొబ్బిలి ఇంచార్జిలు విజయ్ చంద్ర, బేబీనాయన, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపు రెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టీడీపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, మహిళలు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మచ్చలేని టీడీపి అధినేత చంద్రబాబు నాయుడుకు బెయిల్ మంజూరు చేయాలని, తక్షణమే విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన అక్రమ కేసులు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ నిరశన వ్యక్తంచేశారు.దీక్షలో బాగంగా దున్నపోతుకు నిరసన తెలియజేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. రిమాండ్ పొడిగింపుతో ప్రజల్లో ఆందోళన పెరుగుతుందని తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొల్లితిరుపతిరావు, రౌతు వేణు గోపాల్, సాలహరి, దామినేని భాను ప్రసాద్, గర్భాపు ఉదయభాను, బుడితి శ్రీను, జి.లక్ష్మణ,గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌలి, బార్నాల సీతారాం, బుడితి శ్రీరాములు, వాంజరాపు గుంప స్వామి, జక్కు పకీరునాయుడు, యోగేశ్వరరావు, సత్యనారాయణ, తాన్న సత్యనారాయణ, బొంగు సురేష్, పెంట భాను ప్రకాష్, పోల శ్రీనివాసరావు, కొత్తాడ రాంబాబు, రామినాయుడు తదితర టీడీపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు మహిళలూ పాల్గొన్నారు. ఒక కార్యకర్త ఎండతో సొమ్మసిల్లి పడిపోగా ఆయనకు సపర్యలు చేసి నియోజక వర్గ ఇంచార్జి విజయ్‌చంద్ర తన వాహనంలో ఎక్కించి పార్వతీ పురం ఆసుపత్రికి తరలించారు. దీక్షలకు అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు.

నేడు జ్యోతి ఐటిఐ లో జాబ్ మేళా

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక జ్యోతి ఐటిఐలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ కొయిలాడ మురళి తెలిపారు. హైదరాబాదులోని తోషిబా కంపెనీలో పనిచేయుటకు ఎలక్ట్రిషన్, ఫిట్టర్ గ్రూపులలో ఉత్తీర్ణులైన వారు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలన్నారు.ఇతర వివరాలకు 9849180902,9618681199 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

పెట్రోల్‌బంక్‌లో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ శివప్రసాద్ తనిఖీలు

విశాలాంధ్ర-బెలగాం : స్థానిక బెలగాంలో గల ఈశ్వర ఏజెన్సీస్ పెట్రోల్ బంక్ పై వచ్చిన అభియోగాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ ఆర్. శివ ప్రసాద్ ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్వర ఏజెన్సీస్ పెట్రోల్ బంక్ పై పెట్రోల్ కల్తీ జరుగుతుందని వచ్చిన అభియోగంపై పార్వతిపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రజా సమక్షంలో నాజిల్ ద్వారా పరీక్షలు నిర్వహించామని ఈ పరీక్షల్లో ఎటువంటి కల్తీ జరగలేదని నిరూపణ జరిగిందని అన్నారు. అలాగే డెన్సిటీ పరీక్ష కూడా నిర్వహించడం జరిగిందని దానిలో కూడా ఎటువంటి తేడా లేదని అలాగే గత ఆరు నెలలుగా రికార్డులు కూడా పరిశీలించడం జరిగిందని బంకులో ఆపరేషన్ సక్రమంగా జరుగుతుందని ఎటువంటి తేడాలు లేవని ప్రూవ్ అయిందని అన్నారు. బంకులో పబ్లిక్ కు ప్రొవైడ్ చేసిన ఫ్రీఎయిర్, వాటర్ ఫెసిలిటీ, టాయిలెట్ ఫెసిలిటీస్ అన్నీ కూడా ఉన్నాయని అన్నారు.

టీడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి : నిమ్మక జయకృష్ణ



విశాలాంధ్ర-సీతంపేట: పాలకొండ నియోజక వర్గం సీతంపేట మండలం జోగినా యుడు గూడా గ్రామంలో ఈ రోజుబాబుతో నేను సైతం కార్యక్రమంలో బాగంగా టిడిపి పాలకొండ నియోజకవర్గం ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఇంటి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడుని అన్యాయంగా, అక్రమంగా అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించిన విధానాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి, యువత కోసం చేసిన మేలును తెలియజేస్తు ప్రజలకు అవగాహన కల్పించారు. సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖలింగం, యూనిట్ ఇంచార్జ్ బిడ్డిక స్వామీ నాయుడు, మండంగి కుమార్ సవర సోడంగి, గ్రామపెద్దలు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పింఛనుదారుల నెలవారీ సమావేశం

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛను దారులు అక్టోబర్ నెలవారీ సమావేశం ఈనెల 9వ తేదీ రెండవ సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక బెలగాం రైతుబజారు సమీపంలో గల ప్రభుత్వ పింఛనుదారుల సంఘ భవన సముదాయంలో నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంఘ కార్యదర్శి దొడ్లంకి గణపతిరావు తెలిపారు. ఈ సమావేశంలో తే 22-09-2023దీన గుంటూరులో రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సమావేశం నందు చర్చించిన అంశాలు గూర్చి వివరించడం జరుగుతుందని తెలిపారు. కావున పింఛనుదారులందరూ ఈ సమావేశానికి తప్పక హాజరై విజయవంతం చేయవలసినదిగా కోరారు.

గడప గడపకు ప్రకృతి సేద్యం

వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట: అతి తక్కువ ఖర్చుతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా అన్ని పంటలపై అన్ని రకాల హానిచేసే పురుగులను నివారించడానికి అద్భుతమైన పరిష్కారం బ్రహ్మాస్త్రం అని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. పాంచాలి గ్రామంలో సి ఆర్ పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో బ్రహ్మాస్త్రం తయారీని రైతులకు చూపించడం జరిగింది. ముందుగా గ్రామంలో ర్యాలీని నిర్వహించి ప్రకృతి సేద్య కార్యకలాపాలను ఉత్పత్తులను రైతులకు వీధి వీధినా వివరించడం జరిగింది .ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతిరోజు వారం రోజులపాటు ప్రకృతి సేద్య కార్యక్రమాలను రైతులకు వివరించాలని అలాగే ప్రకృతి సేద్య కషాయాలు తయారీని చేసి చూపించాలని సూచించారు అన్ని పంటలలో రసం పీల్చు మరియు ఆకు తినే మరియు కాయి తినే పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం ఒక అద్భుత కషాయం అని వేప కానుగ సీతాఫలం జామ బొప్పాయి నేరేడు వంటి ఆకులు ఒక్కో దాన్ని రెండు కిలోలు చొప్పున ముద్దగా చేసి 15 లీటర్ల గోమూత్రంలో మూడు పొంగులు వచ్చేటట్లుగా మరిగించి 48 గంటల పాటు చల్లార్చి వడగట్టి ఎకరానికి ఐదు లీటర్లు పిచికారి చేసుకుంటే వరిలో ఆకు చుట్టు కాండం తొలుచు పురుగు దోమపోటు నివారణ జరుగుతుందని పత్తిలో రసం పించి పురుగులు మరియు కాయ తులసి పురుగులు నివారణ జరుగుతుందని దీనికి ఎలాంటి ఖర్చు లేకుండానే సస్యరక్షణ చేపట్టవచ్చుని ఈ కార్యక్రమాలను గడపగడపకు వివరించాలని ప్రకృతి సిబ్బందిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో డివిజనల్ యాంకర్ యశోదమ్మ మార్కెటింగ్ ప్రతినిధి నరసింహ వివిధ మండలాల ఐసిఆర్పీలు రైతులు పాల్గొన్నారు.

బాబు అక్రమ అరెస్టుపై టీడీపీ, జనసేనల సామూహిక నిరసన దీక్ష

రిలే దీక్షలో గొంపకృష్ణ కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు అక్రమ అరెస్టుకి నిరసనగా ఆదివారం శృంగవరపు కోటలోని ఆకుల డిపో వద్ద తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆదేశాల మేరకు గొంప రమాదేవి ఆధ్వర్యంలో గొంప వెంకటరావు (వేపాడ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు), గొంప తులసి (బానాది ఎంపీటీసీ), గుమ్మడి వాణి భారతి (నియోజకవర్గం మహిళా అధ్యక్షరాలు), గొంప వెంకటరావు (అంకజోస్యులపాలెం గ్రామం), కోటానా అర్జునరావు (వీలుపర్తి మాజీ సర్పంచ్), గొంప రమణమ్మ (బాణాది), వైసూర్యం (కరకవలస సీనియర్ నాయకులు),రావడ గోవింద్(చమలదేవి అగరహారం), రావడ ఈశ్వరరావు (చామలదేవి అగ్రహారం), పాటూరు ప్రసాద్ (చామలదేవి అగ్రహారం), నాగమయ్య (బల్లంకి గ్రామం) కలిసి రిలే నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా గొంప రమాదేవి మాట్లాడుతూ ప్రపంచానికి, దేశానికి ఒక దిక్సూచిగా ఉన్న చంద్రబాబు ఏ తప్పు చేయకపోయినా అక్రమంగా అరెస్టు చేశారు. చంద్రబాబుని ఎన్ని రోజులు జైలులో ఉంచితే అంత ప్రజామద్దతు వస్తుందని, ఈ ప్రజామద్దతులో, ప్రజా ఉప్పెనలో సీఎం జగన్ ప్రభుత్వం, పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. రాష్ట్రానికి ఎంతో కీలకమైన అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తిగా పడుకోబెట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ జరగకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేని చేతకాని అసమర్థుడు జగన్ అని మండిపడ్డారు. కాగా ఈ రిలే నిరాహారదీక్షలో గొంప వెంకటరావు (వేపాడ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు), గుమ్మడి వాణి భారతి (నియోజకవర్గం మహిళా అధ్యక్షరాలు), సేనాపతి లీలా అప్పారావు (వీలుపర్తి సర్పంచ్), గొర్రుపోటు రమణ (మాజీ ఎంపీటీసీ సోంపురం), సిరికి రమణ (ఆతవ మాజీ సర్పంచ్), జనపరెడ్డి ఈశ్వరరావు (విశాఖ పార్లమెంట్ కమిటీ మెంబెర్), సేనాపతి గణేష్ (ఐటీడీపి అధ్యక్షులు వేపాడ), కర్రి రామారావు (చిన గుడిపాల), గొంప రామకృష్ణ (బానాది), కోటాన అర్జునరావు (వీలుపర్తి మాజీ సర్పంచ్), కందిపల్లి రామేష్ (బానాది గ్రామ పార్టీ అధ్యక్షులు బానాది), బల్లంకి దేముడు (ఎం. సింగవరం మాజీ కోపరేటివ్ డైరెక్టర్), సలాది రాము, కొట్యాడ వెంకటరావు, బొత్స జయరాజు, కండిపల్లి అప్పల నాయుడు, గొంప సత్యనారాయణ, భోజంకి నారాయణ మూర్తి, రంధి నరసింహ నాయుడు, ముమ్ములూరు అప్పలనాయుడు, ముమ్ములూరు జగ్గు నాయుడు (పీకేఆర్ పురం), నిరుజోగి సన్యాసినాయుడు, గొంప వెంకటరమణ, ముక్క రామకృష్ణ, మంచిన అప్పల సూరి, పల్లి ధనంజయ, గొర్లె రమేష్, దబ్బి శ్రీను, సిరికి రమణ, ఆధాపురెడ్డి కృష్ణ, సేనాపతి గోవిందా, గొంప రమణమ్మ, వై సూర్యం, రావడ గోవింద, రావడ ఈశ్వరరావు, పాటూరు ప్రసాద, నాగమయ్య, గొర్లె అప్పారావు, అడపా రమణ, గొల్ల మహేష్, నిరుజోగి శ్రీను, ములగడ శివ, రెక్కీ సన్యాసమ్మ, వై. సూర్య,కలవపల్లి శంకర రావు, తాడి కృష్ణ, దొగ్గ రమేష్, ముమ్మన అప్పల ఈశ్వరరావు, గొంప రామకృష్ణ, నౌదూ రామ్మూర్తి, కండిపల్లి రామారావు, పీ సూర్యనారాయణ, పీ త్రినాథ, కొట్యాడ ముత్యాలనాయుడు , బొంతు గోవింద, సామినాయుడు, బంగారి రమణ, సత్తిబాబు, కొట్టన ఎర్రినాయుడు, రావడ ఈశ్వరరావు, పాటూరు సత్యం పాల్గొని మద్దతు తెలిపారు.

సాముహిక రిలే దీక్షలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

దీక్షలో కూర్చున్న వేపాడ టీడీపీ నాయకులు

దీక్షా శిబిరం వద్ద ఒంటి కాలిపై నిల్చొని మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న నిరసన

శృంగవరపుకోట : నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్, పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసులదాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా ఆదివారం శృంగవరపుకోటలోని పుణ్యగిరి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా 26వ రోజు సామూహిక రిలే నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యేతో పాటుగా వేపాడ మండలం నుండి 250 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత కూర్చున్నారు. దీక్షలో కూర్చున్న టీడీపీ మహిళ లు, నాయకులందరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాలు చేసినంతరం, నల్ల బ్యాడ్జ్ లు, కండువాలు ధరించి, మీతోనే మేము సైతం అంటూ చంద్రబాబు కి మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సామూహిక రిలే నిరాహారదీక్షలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో గల మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఐటీడీపీ, టి.ఎన్.ఎస్.ఎఫ్, తెలుగుయువత, తెలుగు మహిళా, తెలుగురైతు, వివిధ హోదాల్లో ఉన్న అనుబంధ కమిటీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వానికి, సీఎం జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా టీడీపీ నేతలు నినాదాలు చేశారు.

అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొడదాం

జనసేన నేత గురాన అయ్యలు

విజయనగరం టౌన్: అవినీతి ప్రభుత్వాన్ని తరిమేద్దాం.. ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిద్దాం నినాదంతో ఇంటింటికి జనసేన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. ఇంటింటికి జనసేన కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ నగర్ లో ఆదివారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని.. జనసేన పార్టీ రూపొందించిన కర పత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా జనసేన పని చేస్తోందన్నారు. వైసీపీ అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వారి మాటల్లో నిజం లేదన్నారు. జనసేన-తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే ఏ ఒక్క సంక్షేమ పథకం నిలిపేది లేదనీ... పేదలు, బడుగు, బలహీనవర్గాలను ఆదుకుంటున్న ఏ పథకం ఆగిపోదనీ.. ఇప్పుడున్న సంక్షేమ పథకాలకు మరింత అదనంగా జోడించి వారిని ఆదుకునేలా తమ ప్రణాళికలు ఉంటాయన్నారు. వైసీపీ నాయకులు కుటిల రాజకీయాలను మానుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. అభివృద్ధి పనులు చేసి అభిమానాన్ని సంపాదించాలి కాని బెదిరింపులతో కాదని అన్నారు. విజయ నగరంలో సుందరీకరణ పేరుతో అడ్డగోలు సంపాదనకు స్థానిక ప్రజాప్రతినిధి వినూత్న ఆలోచనలు చేస్తున్నారని ఆరోపించారు.ప్రజా సొమ్మును విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ఆర్ నగర్ కి వచ్చే రోడ్డు, కాలనీ రోడ్లు అధ్వానంగా వున్నాయని....వర్షాలు పడితే వాహనాలు తిరగలేని పరిస్థితి వుందన్నారు. అలాగే త్రాగునీరు, వీధి దీపాల సమస్యలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. కనీసం వాటర్ ట్యాంక్ కూడా నిర్మించలేని దుస్థితిలో పాలకులు వున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్ నగర్ లో మౌలిక నదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు తోట రమేష్, సియ్యాదుల ఝాన్సీ, భరత్, సియ్యాదుల శేఖర్ వార్డు జనసేన నాయకులు పిడుగు సతీష్, పి. రాజ్యు లక్ష్మీ, ఆర్ .కవిత, కె.పుష్ప,విక్కీ, రాజేష్ , పాపరావు, షేక్ బాబాజీ, మురళీ, రాజా, సాయి, నియోజకవర్గ జన సైనికులు డి.రామచంద్రరాజు, కాటం అశ్విని, మాతా గాయిత్రి, పితాల లక్ష్మీ, దుప్పాడ జ్యోతి,గట్లాన పుష్ప, అడబాల వేంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం..

చీపురుపల్లి: వైసీపీ అరాచక విధానాలను ఖండించాలని విజయనగరం జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పైల బలరాం అన్నారు. చీపురుపల్లిలో ఆదివారం మెరకముడిదాం మండలం పలు గ్రామాల నుండి కార్యకర్తలు బొత్స సాంబయ్య, జమ్ము శంకర్రావు, రెడ్డి వెంకట నాయుడు, యడ్ల అప్పల నాయుడు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాజకీయకక్షతో పరిపాలన కొనసాగిస్తున్నారు అని అన్నారు. ప్రజా వేదిక కూల్చారన్నారు. ప్రజలకోసం ఆలోచించే ముఖ్యమంత్రి అయితే ప్రజా వేదిక కూల్చరన్నారు. కార్యక్రమంలో మెరకముడిదాం మండల పార్టీ అధ్యక్షులు తాడ్డె సన్యాసినాయుడు, సారేపాక సురేష్ బాబు, గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, మండల అప్పలనాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, ఆరతి సాహూ, సబ్బి సోనియా, గడే సన్యాసప్పలనాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరణం శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

గజపతినగరం: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం తమ పార్టీ కార్యాలయం ఆవరణలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు ఈ నిరసన లో పలు నినాదాలు చేస్తూ చంద్రబాబు నిర్దోషిగా తిరిగి వచ్చేవరకు ఈ నిరసన పోరాటం ఆగదని అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు లంక సత్యనారాయణ లంక చిన్నం నాయుడు మిత్తి రెడ్డి ఈశ్వరరావు ఆర్ అరుణ మజ్జి గోవింద ఇల్లాపు కృష్ణ పిన్నింటి లక్ష్మీనాయుడు కర్రి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి అత్యుత్తమ సత్కారం

సర్పంచుల సారథ్యంలో ఘనసన్మానం

ఆర్ డబ్ల్యూఎస్ డిఈఈ పైడిరాజు సేవలపై ప్రశంసల జల్లు.

విశాలాంధ్ర-వేపాడ: అధికారం అన్నది సేవలందించేందుకు ఒక సువర్ణ అవకాశం. ప్రజలు కట్టబెట్టిన పదవైనా కావొచ్చు లేదా ప్రభుత్వ అధికారైనా కావొచ్చు.ప్రజలకు సేవలందించాలన్న తపన వారికి ఉండాలి. అలాంటి వ్యక్తులు ఏ రంగంలో ఉన్నా సేవలందించడం తద్వారా ప్రజల మన్ననలు అందుకోవడం షరా మామూలే. అదే కోవకు చెందుతారు శృంగవరపుకోట నియోజకవర్గ గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఈఈ కేఆర్వి పైడిరాజు. హోదాలు మారినా స్వభావం మారని డిఈఈ సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్క రించుకొని కలెక్టర్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ అధికారిగా ఎంపిక చేసి అవార్డు అందించి సత్కరించిన సంగతి అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో మండల సర్పంచులంతా సామూహికంగా డిఈఈ పైడిరాజును సత్కరించాలన్న యోచనతో ఆదివారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు సారథ్యంలో చినగుడిపాల సర్పంచ్ బోజంకి రామునాయుడు అధ్యక్షతన డిఈఈ పైడిరాజుకు మండలం లోని 28 మంది సర్పంచులు నుదుట తిలకం దిద్ది పూలమాలలు వేసి శాలువలు కప్పి ఘనం గా సన్మానించారు. అలాగే మండల పాత్రికే యులు కూడా ఆయనకు బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సర్పంచులు పైడిరాజుకు బంగారపు ఉంగ రాన్ని తొడిగారు. ఈ సందర్భంగా పైడిరాజు మండలంలో ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ గా, ప్రస్తుతం డిఈఈగా అందిస్తున్న సేవలను జడ్పీటీసీ ఎస్ అప్పారావు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, సర్పంచులు గుర్తు చేస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, రుద్ర వెంకటరావు, మురిపిండి గంగరాజు, వడ్లమాని శర్మ, నౌడు అరుణ శ్రీను, చెల్లుబోని బాలబాబు, బల్లంకి కనకరాజు, కర్రి యశోద, గొటివాడ దేవి, నాగిరెడ్డి చిరంజీవి, బీల రాజేశ్వరి సతీష్, శానాపతి లీల అప్పారావు, మెలిపాక అర్జునమ్మ రమణ, సుంకరి రమణమ్మ బంగారయ్య, గొంప వేమనరాము, దండుపాటి ముత్యాలమ్మ సత్తిబాబు, కోలా సతీష్, దుల్ల అప్పన్న, బుద్ధ చిన్నమ్ములు, క్రిష్ణ, దుల్ల సన్యాసిరావు, ఎర్రా సన్యాసిరావు, నాగిరెడ్డి కనకరాజు, దివదారి లక్ష్మి, శేఖర్ సర్పంచులు పాల్గొన్నారు.

తుమ్మికాపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి రూప గణపతిని దర్శించుకున్న కోళ్ల దంపతులు

విశాలాంధ్ర-కొత్తవలస: మండలం లోని తుమ్మికాపల్లి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి రూపంలో దర్శనం ఇస్తున్న విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరునిగా పేరుపొందిన స్వామివారిని ఆదివారం శృంగవరపుకోట నియోజకవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ దర్శించుకున్నారు. అనంతరం గణపతి మండపంలోని అర్చకులు ద్వారా స్వామివారికి చంద్రబాబుగారి గోత్రనా మాలు, నారా వారి కుటుంబసభ్యులు పేరుమీదుగా ప్రత్యేక పూజలు నిర్వ హించారు. రేపు వెలువడే దేశం మొత్తం సర్వత్రా ఆసక్తిగా చూస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రిమాండ్ కేసు కోర్టు తీర్పు ఎటువంటి ఆటంకాలు, విఘ్నాలు కలగకుండా, ఆయనకు మనోధైర్యంతో కూడిన సంపూర్ణ ఆయురారోగ్యాలు చేకూరాలని, శత్రుశేష మూకలు నుండి కాపాడాలని, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన నుండి రాష్ట్ర ప్రజలను రక్షించి కాపాడాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), ఎల్. కోట మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ పొట్నూరు వేంకటరత్నాజీ, తుమ్మికాపల్లి మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు, యూనిట్ ఇంచార్జ్ పప్పు అప్పలరాజు, వల్లేపు కైలాస్, తుమ్మికాపల్లి ఎంపీటీసీ పిల్లా లక్ష్మీ, వైస్ ప్రెసిడెంట్ అద్దూరి సత్యనారాయణ, రాజాన భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు తదితరులు పాల్గొన్నారు

రిలే నిరాహార దీక్షలో వేపాడ టీడీపీ నాయకులు

వేపాడ: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయడు అక్రమ అరెస్ట్, పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీ సుల దాడులకు నిరసనగా ఆదివారం వేపాడ మండల టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నియోజకవర్గ కేంద్రం శృంగవరపుకోటలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట,పుణ్యగిరి రోడ్డులో గల అన్న క్యాంటీన్ వద్ద నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా సామూహిక రిలే నిరాహార దీక్షలో ఆమెతో పాటు వేపాడ మండలం నుండి 250 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్షలో కూర్చోన్న టీడీపీ మహిళలు, నాయకు లందరూ సంతకాలు చేసినంతరం, నల్ల బ్యాడ్జ్ లు, కండువాలు ధరించి, మీతోనే మేము సైతం అంటూ చంద్రబాబునాయుడు మద్దతుగా సంఘీభావం తెలిపారు.ఈ సామూహిక రిలే నిరాహార దీక్షలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, వేపాడ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకట రమణ, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, నిరుజోగి అమ్మ తల్లి నాయుడు, గోకేడ నాగభూషణం, గుమ్మడి గణేష్, చిరిగిరెడ్డి అవతారం, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, ఐటీడీపీ, టి.ఎన్.ఎస్.ఎఫ్, తెలుగుయువత, తెలుగుమహిళా, తెలుగురైతు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో మాజీ మంత్రి పడాల అరుణ నిరసన

గజపతినగరం: చంద్ర బాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసినం దుకు నిరసనగా మాజీ మంత్రి జనసేన నాయకురాలు పడాల అరుణ మండల పార్టీ అధ్యక్షులు మునకాల జగన్నాధ రావులు శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమంలో పడాల శరత్ చంద్రశేఖర్ ఉమా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ప్రెస్ అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన జరుగుతుందని డిపిఆర్ఓ లోచర్ల రమేష్ ఒకప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండో విడత అక్రిడిటేషన్ గుర్తింపు కార్డులు జారీపై ఈసమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇప్పటికే మొదటివిడతగా జూన్‌లో నిర్వహించిన మొదటి సమావేశంలో జిల్లాలో 139 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీచేసిన సంగతి తెలిసిందే. సోమవారం జరుగనున్న సమావేశానికి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులైన,ఆర్టీసి, రైల్వే, కార్మికశాఖ, డిపిటిఓ, ఆరోగ్యశ్రీ అధికారులు, పత్రికాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

సమాచార హక్కు చట్టం జిల్లా సభ్యులు సూర్యారావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, చట్టం వచ్చి ఈనెల 12 నాటికి 18 సంవత్సరములు పూర్తవు తుందని సమాచార హక్కు చట్టం జిల్లా సభ్యులు డి.సూర్యారావు తెలిపారు. ఎస్.కోట పట్టణంలోని బీసీ హాస్టల్ ఆవరణలో వార్డెన్ సత్యనారాయణ అధ్యక్ష తన అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సహ చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు డి. సూర్యారావు మాట్లాడుతూ ఈ నెల 12 నాటికి 18 సంవత్సరాలు పూర్తి అవుతున్న కూడా ప్రభుత్వ కార్యాలయంలో ఫోర్ వన్ బి కానీ పిఐఓ, ఏపీఐఓ అప్లియేట్ అథారిటీ బోర్డులు లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే ఈ చట్టంలో సెక్షన్ 26 ప్రకారం ప్రభుత్వం 18 నెలల్లో దేశంలో ఉన్న ప్రజానీకానికి అవగాహన కల్పించాల్సి ఉండగా అటువంటి దాఖలాలు లేకపోవడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమానికి సహ కార్యకర్త ధనుంజయ్, మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబర్ 14, 15 తేదీల్లో బిర్సాముండా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎజెఎసి చైర్మన్ కొండ గొర్రి ధర్మారావు అధ్యక్షతన స్థానిక బెలగాం గిరిజన భవన్ లో ఆదివారం జిల్లా స్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో నవంబర్ 14వ తేదిన బిర్సా ముండా 149వ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్ర ఆదివాసీ జెఎసి పిలుపు మేరకు జరగబోయే జాతీయ ఆదివాసీ బిర్సా ముండా జయంతి వేడుకలు/ జాతీయ సదస్సును (నవంబర్ 14,15 తేదీలు) పాడేరులో నిర్వహించుటకు సమాయత్తం చేయడం జరిగింది. మండలస్థాయిలో ఆదివాసీ సమాజం లో సమావేశాలు జరిపి పెద్దఎత్తున భగవాన్ భిర్సా ముండా ఆశయ సాధనకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు నిర్ణయం తీసుకోవడమైనది. సమావేశంలో జాయింట్ సెక్రటరీ దుక్క సీతారాం, వైస్ చైర్మన్ జయన్న, జనరల్ సెక్రటరీ కొండగొర్రి ఉదయ్ కుమార్, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బిడ్డిక రామారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా తో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-గరివిడి : శ్రీవాసవీ నిత్యనిర్మల యోగా పీఠం 18వ వార్షికోత్సవం గర్భం రోడ్ లో గల యోగా కేంద్రం లోయోగా గురువు ఎ. సత్య శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది, ముఖ్యఅతిథిగా గరివిడి జడ్పీటీసీ సభ్యులు వాకాడ శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు గా కొండపాలెం సర్పంచ్ పి. ప్రమీలా కుమారి, ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, డి శంకర్ లాల్ శర్మ, బలగం వెంకటరావు, వైశ్య వర్తక సంఘం అధ్యక్షులు సీమకుర్తి మురళి, బ్రహ్మకుమారి లత అక్కయ్య, పి.కుమార్, సయ్యద్ ఘఫార్ ఖాన్, వాసవి క్లబ్ ప్రతినిధి వి.వి.ఎస్.ఎన్. గుప్తా మాస్టారు పాల్గొని యోగా ప్రాధాన్యతని, గత 18 సంవత్సరాలు గా ఉచితంగా యోగా సెంటరుని నిర్వహిస్తున్న కనకేశ్వర రావు మాస్టారి సేవలను అభినం దించి గరివిడి లో ప్రతి ఒక్కరు యోగ సాధన చేసి పరిపూర్ణ ఆరోగ్య వంతులు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగ పరచుకోవాలని వక్తలు తెలియజేశారు, యోగా సభ్యులు, జి. లావణ్య, అంబళ్ల గౌరునాయుడు వారి అనుభవాలను, యోగా వల్ల వాళ్ళు పొందిన ప్రయోజనాలను వివరించారు, అనంతరం యోగా గురువులు ఎ. కనకేశ్వర్రావు, ఎ.సత్య శ్రీనివాసు లను సభ్యులు ఘనంగా సత్కరించారు యోగా సభ్యులు ఆనంద్ వందన సమర్పణ తో సభ ముగిసింది, హాజరైనఅందరికి అమృతాహారం అందజేశారు.

=రామతీర్థంలో వైభవంగా ధర్మ ప్రచార వారోత్సవాలు

విశాలాంధ్ర -నెల్లిమర్ల: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఆదివారం వైభవంగా ధర్మప్రచార వారోత్స వాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గోపూజ మహోత్సవంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు రామస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీమద్రామాయణ ప్రవచనం టిపి రాధాకృష్ణ మాచార్యులు ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాట్ల సత్యనారాయణ రాజు, ఆలయ సహాయ కమిషనర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

సర్పంచులకు సరే ... ఎంపీటీసీలను గౌరవించరా?

సచివాలయాల్లో ఎంపీటీసీలకు ప్రత్యేక గది ఏది?

చిన్నచూపుపై ఎంపీటీసీల ఆవేదన

విశాలాంధ్ర-వేపాడ : మన ప్రజాస్వామ్య దేశంలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతి ఒక్కరిని గౌరవించు కోవలసిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది. పంచాయతీ స్థాయిలో ప్రధమ పౌరుడు సర్పంచ. ఆ తర్వాతి స్థానం మండల ప్రాదేశిక సభ్యులకు దక్కుతుంది. జిల్లా స్థాయిలోను, మండల స్థాయిలోనూ జిల్లా ప్రాదేశిక సభ్యులను ఎలా గౌరవిస్తారో మండల స్థాయిలోను, గ్రామ స్థాయిలో కూడా మండల ప్రాదేశిక సభ్యులను కూడా గౌరవించాల్సి ఉంది. కానీ ఎంపీటీసీ వ్యవస్థను తీసుకు వచ్చినప్పటి నుండి వారికి ఎక్కడా ప్రత్యేక వసతి కల్పిం చలేదు. దాంతో వారు చాలా అవమానాలకు గురికావలసి వస్తోంది. ఎంపీటీసీ పదవి కోసం పోటీపడి వ్యయప్రయాసలకు గురై పదవిని సంపాదించు కోగలిగినప్పటికి వారికి ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయింది. మండల స్థాయిలో ఎంపీపీకి తప్ప ఎంపీటీసీలకు ప్రత్యేకంగా ఎటువంటి నిధులను కేటాయించిన దాఖలాలు లేవు. గ్రామస్థాయిలో మాత్రం సర్పంచుకు నిధులతో పాటు సచివాలయంలో ప్రత్యేక గదిని కూడా కేటాయించారు. ఎంపీటీసీకి మాత్రం ఎటువంటి అధికారాలు లేని నామమాత్రపు పదవి తప్ప కనీసం సచివాలయంలో కూడా ప్రత్యేక గది లేకుండా చేయడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. ప్రత్యే క నిధులు లేక ప్రత్యేక వసతి లేని పదవి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనని నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎంపీటీసీ వ్యవస్థను మెరుగుపర్చి అన్నివిధాలా సము చితస్థానం కల్పించి వారికి ప్రజల్లో గౌరవం ఇనుమడింప చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జగనన్న ఆరోగ్య సురక్షకు మంచిస్పందన

వైద్యులు శిరీష, ఉషారాణి, రాధాకాంత్

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని గత 30 నుండి గ్రామసచివాలయంలలో ఎంపిడిఓ మహేష్ రెడ్డి,తహశీల్దార్ ఎన్వీ రమణల పర్యవేక్షణలో రెండుటీములు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, పెద్దఎత్తున రోగులు విచ్చేసి తనిఖీలు చేసుకుంటున్నట్లు సీతానగరం, పెదఅంకలం ప్రాదమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శిరీష ,ఉషారాణి, రాధాకాంత్ లు తెలిపారు.శిబిరంవద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా రోగులకు వైద్యసేవలు పట్ల ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృతంగా సచివాలయం సిబ్బంది,వైద్య సిబ్బంది,వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు వచ్చి పాల్గొని తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రతీ సచివాలయం పరిదిలో 450మంది వరకు వైద్యసేవలు కోసం వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు, జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా వైద్య అధికారులు ఈశిబిరాలను సందర్శన చేస్తూ సద్వినియోగం చేసుకోవాలని కోర రుతూ వారు పలు సూచనలు చేస్తున్నారని అన్నారు.జెఏఎస్ హెల్త్ క్యాంప్ లకు రెండువారాల ముందుగానే ప్రజా ప్రతినిదులు,సచివాలయం సిబ్బంది, వైద్యసిబ్బంది, గ్రామవాలంటీర్లు చేస్తున్న ప్రచారం వల్ల మంచి స్పందన వస్తోందన్నారు. మండలంలోని ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిదులు,నాయకులు ,సచివాలయం సిబ్బంది, వైద్యసిబ్బంది పూర్తి సహకారం వల్ల విజయవంతంగా జరుగుతుందని చెప్పారు.

వైభవంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ సదస్సు

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని వాసవి భవనంలో ఆదివారం నాడు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ సదస్సు (మమ్ములాస్ ఎంవిఆర్-రీకాన్ 3రీజనల్ కాన్ఫరెన్స్) ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గోల్డెన్ స్టార్ మొగలూరి రవి కుమార్ హాజరు కాగా, రీజనల్ చైర్మన్ మమ్ముల విశ్వేశ్వర రావు ఆధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి నుంచి డిసెంబర్ క్యాలెండర్ ప్రాతిపదికను పెద్దఎత్తున సేవా కార్యక్రమాలను జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లా, స్థానిక ప్రాముఖ్యత కలిగిన అన్ని కార్యక్రమాలని విజయవం తంగా చేస్తున్నట్లు తెలిపారు. వినయం-విజయం పేరిట ఈఏడాది సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీతానగరం, పార్వతీపురం, నవరంగపూర్, రామభద్రపురం, తాళ్ళబురిడి, గజపతినగరం, అంబటి వలస, గొట్లం, నర్సిపురం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థలలో విశిష్ట సేవలు అందించేందుకు కృషిచేసిన వారికి ఉత్తమ ప్రెసిడెంట్, ఉత్తమ సెక్రెటరీ, ఉత్తమ కోశాధికారి అవార్డులు, ఉత్తమ వాసవీ క్లబ్ అవార్డులు ఆదివారం అందజేసినట్లు మమ్ముల విశ్వేశ్వరరావు తెలిపారు. తనకు ఏడాదిపాటు రీజనల్ చైర్మన్ అవకాశం ఇచ్చినసంస్థవల్ల ఎన్నో సేవా కార్య క్రమాలను గత తొమ్మిది నెలలకాలంలో చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిశీలకులు కొత్తా సన్యాసిరాజు, జిల్లా కోశాదికారి కసుమంచి వెంకట రావు, జిల్లా ఇంఛార్జిలు పి. పండరికక్ష, మాటూరు రాజేష్, గంట శైలజలతో జోనల్ చైర్మన్ ఆరిశెట్టి సత్యనారాయణ, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఏ. గోవిందరాజు, కూర్మదాసు శ్రీనివాసరావు, కూర్మదాసు లక్ష్మణరావు, గ్రంధి శ్రీనివాసరావు, గ్రంధి ప్రసాద్, కూర్మదాసు గోవింద్, మమ్ముల అజయ్ కుమార్,మమ్ముల మణికంఠ కృష్ణ కుమార్ తదితరులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యం

- మంచి సమాజం, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యం
- మనమంతా అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది..
- బెంగళూరు టీడీపీ పోరం సభలో కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - బీపురుపల్లి : చంద్రబాబుతోనే మంచి సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని, ఆయనతోనే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో బెంగళూరులోని కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన సమర శంఖారావం కార్యక్రమంలో నాగార్జున పాల్గొని ప్రసంగించారు. ఇక్కడ ఐటీ ఉద్యోగులు అధిక శాతం ఉన్నారని, తాను కూడా ఒకప్పుడు ఐటీ ఉద్యోగినే అని చెప్పారు. కాలిఫోర్నియాలో ఉద్యోగం చేస్తూ, కోటి రూపాయలకు పైగా సంపాదించుకునే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. కానీ.. ఆత్మ సంతృప్తికి, సమాజం కోసం ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో తాను ఆ ఉద్యోగం వదిలి 2019 ఎన్నికల్లో చీపురుపల్లి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ స్థానానికి పోటీ చేశానని తెలిపారు. అప్పట్లో ఓటమి చెందిన తర్వాత తాను తీవ్రంగా ఆలోచించానని.. రాజకీయాల్లో ముందుకు పోవాలా, లేక వెనక్కి వెళ్లి ఉద్యోగం చేసుకోవాలా? అని ఆనుకున్నట్లు తెలిపారు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా నిలవాలని, మంచి సమాజం నిర్మాణానికి చంద్రబాబు పడుతున్న కష్టాన్ని చూసి ఇక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అందుకోసం నాలుగున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నా అన్నారు. తాను పోరాటం ఇంత ఉధృతంగా చేయాల్సి వస్తుందని ఊహించలేదన్నారు. పోరాటం వ్యవస్థతో చేయాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. తెలుగుదేశం పార్టీకి ఓటేస్తే పింఛన్ తీసేస్తారన్న విషయం అమెరికా నుంచి వచ్చిన తనకు తెలియదన్నారు. టీడీపీ వారు ఉన్న కాలనీకి రోడ్లు వేయరని.. టీడీపీ వారు ఇళ్లు కట్టుకుంటే బిల్లులు కూడా చేయరన్న విషయం ఈ నాలుగున్నరేళ్ల కాలంలోనే తెలుసుకున్నానని వివరించారు. ఇదే అంశాలపై ఒక మంత్రితో, ఒక ఎంపీతో, ఒక జిల్లా పరిషత్తు ఛైర్మన్ తో చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పోరాటం చేయ వలసి వచ్చిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మళ్ళీ అభివృద్ధి చెందుతుందనుకుంటున్న తరుణంలో ఆయనను అన్యాయంగా అరెస్టు చేశారని తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో జగన్ ఓడిపోవడం ఖాయం.. చంద్రబాబు ముఖ్యమంత్రి అవడం తథ్యమని చెప్పారు. దానికి భయపడే చంద్రబాబును జైల్లో పెట్టించారని తెలిపారు. ప్రజల్లో చైతన్యం ఉందన్నారు. ఈ రాష్ట్రానికి ఎవరు ముఖ్యమంత్రి అయితే అభివృద్ధి చెందుతుందో వారికి తెలుసన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎక్కడైనా ఒక రోడ్డు వేశారా? కనీసం ఒక ఇంటికి కుళాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. యువతకు కనీసం ఉపాధి అవకాశాలు కూడా ఆంధ్ర రాష్ట్రంలో లేకుండా చేశారన్నారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే వ్యవస్థలన్నీ నాశనం చేస్తారని విమర్శించారు. ఈ రోజున తన నియోజకవర్గంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా.. కనీసం బయట అడుగుపెట్టనీయడం లేదని, పోలీసులు అంక్షలు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిజంగా జగన్ కు మంచి పరిపాలన చేయాలన్న ఆత్మవిశ్వాసం ఉంటే ఇవన్నీ చేయాల్సిన అవసరం ఉందా? అని ప్రశ్నించారు. చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి అవుతారన్న నమ్మకం ఉందన్నారు. అందుకోసం మనమంతా కలిసి పని చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాల కోసం పోరాడుదామని, చంద్రన్నకు అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు.

2024లో జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పండి

టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : 2024 లో జరుగు ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన పిలుపునిచ్చారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్యాయంగా అక్రమంగా అరెస్ట్ చేసి రిమాండ్ విధించడంను నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన నాయకత్వంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం కు 26వ రోజుకు చేరింది. ఆదివారం రిలే నిరాహార దీక్షలో బాడంగి మండలానికి సంబంధించి గజరాయనివలస గ్రామం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు సుమారుగా 150 మందికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన పార్టీ కండువాలు వేసి దీక్షలో కూర్చుండబెడుతూ...మేముసైతం బాబుకి అంటూ...సైకిల్ పోవాలి...సైకిల్ రావాలి అనే నినాదాలతో, సంతకాల సేకరణ చేస్తూ దీక్ష కొనసాగించారు. ఈ దీక్షా కార్యక్రమంలో మద్దతు తెలుపుతూ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్ బాబు ,బాడంగి మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు , మైప ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, గజరాయనివలస సర్పంచ్ మూడడ్ల సత్తిబాబు, సిరిపు సత్యం, ఉప సర్పంచ్ తెర్లి కాము నాయుడు, రేజేరు గ్రామ మాజీ సర్పంచ్ గుల్లిపల్లి రామినాయుడు, బొబ్బిలి మండలపార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి. సత్యనారాయణ నియోజక వర్గంలో గల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా సమయం ముగింపు దశకు చేరుకున్న సమయంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఈ దీక్షా కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు అందరికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ చేయించారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - సీతంపేట : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోక్సో యాక్ట్ పై అవగాహన కలిగించడం కోసం దిశ సెల్ మహిళ సబ్ ఇన్స్పెక్టర్ తన సిబ్బంది మరియు సీతంపేట పోలీస్ సిబ్బంది తో హడ్డుబంగి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ఈవ్ టీజింగ్ వంటి సంఘటనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ దిశ చట్టాలు గురించి అవగాహన ఇస్తూ, దిశ యాప్ డౌన్లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు పల్గొన్నారు. అని సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ నీలకంఠరావు తెలిపారు.

కొత్తవలసలో ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర - సీతానగరం : అన్నదాత ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధగా నమ్మి తొందని, దీనికోసమే అనేక వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఈ క్రమంలోనే ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకూ ప్రయోజనాలు కల్పించే క్రమంలో ఈ క్రాప్ పేరుతో పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని కొత్తవలస సర్పంచ్ రెడ్డి అనిత అప్పలనాయుడు తెలిపారు. సర్పంచ్ అనిత అప్పలనాయుడు సమక్షంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు కార్యక్రమం ఉదయం నుంచి చేపట్టారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. వ్యవసాయ సహాయకులు అఖిల్, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వసతులు గృహాలకు పక్కు కూరగాయలకు సప్లై కు టెండర్లు

విశాలాంధ్ర - సీతంపేట : ఐటీడీఏ పరిధిలో గల గిరిజన గురుకులాలు, మినీ గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరా చేయుటకు ఈనెల 9వ తేదీన అనగా సోమవారం నిర్వహించాల్సిన టెండర్లు కార్యక్రమం ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసినట్లు ఐటిడిఏ పీవో కల్పనకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ విషయాన్ని టెండరుదారులు గమనించాలని పత్రికల ద్వారా తెలియజేయటమైనది. తేదీ, సమయానికి హాజరుకావాలని కోరారు.

గిరిజన ఆదివాసీలు ఆదివారం పాదయాత్ర

విశాలాంధ్ర - జైలం : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజక వర్గం గుమ్మ లక్ష్మీ పురం మండలం రాయగడ జమ్ము పంచాయితీల్లో పలు గ్రామాలకు చెందిన గిరిజన ఆదివాసీలు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వి. భాస్కరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాదయాత్ర నుద్దేశించి ఆయన మాట్లాడుతూ చలో పాలకొండ ఐటీడీఏ ఆఫీస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే సోమవారం జరుగబోయే ఆర్ టైర్ డ్రాలిని జయప్రదం చేయాలన్నారు. కొండచిన్నెడి గ్రామం పాదయాత్ర చేసుకుంటూ వెళుతుండగా గన్నెటి డ్రైన్ డోలు సహాయంతో కర్రలతో డోలు కట్టి వస్తున్నటువంటి దుస్థితి చూసి ఈ గ్రామానికి రోడ్డు, ఆసుపత్రి సౌకర్యం పోవాలన్న చాలా కష్టమని అందుకు ప్రభుత్వం తక్షణమే ఆదుకుని రోడ్డు కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.సురేఖ, కురుపాం మండల కార్యదర్శి సురేష్, మురళి, గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి ఎం.శుక్రు, మహిళా కార్యకర్తలు, అధిక సంఖ్యలో పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఈకేవైసీ, ఈ పంట నమోదు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని అన్ని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి సవరపు అవినాష్ ఆధ్వర్యంలో సచివాలయాల వ్యవసాయ సహాయకులు గత వారం రోజులుగా తెల్లవారు జామునే రైతుల వద్దకు నేరుగా వెళ్లి ఈకేవైసీ, ఈ-పంట నమోదు చేయడంలో ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర వ్యవసాయ కమిషనర్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారుల ఆదేశాలు, సూచనలు, సలహాలను పాటిస్తూ ఎప్పటి కప్పుడు శతశాతనమోదుకు దృష్టి పెట్టారు. ఒక్క రైతుకు ధాన్యం అమ్మకాలు సమయంలో, భీమాలో నష్టం జరగకుండా ఉండేందుకు ఈకేవైసీ, ఈ పంట నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. పెదభోగిలలో జరిగిన కార్యక్రమంలో రైతులు ఇజ్జాడ రాంబాబు కొల్లా శ్రీను తదితరులున్నారు.

గడపగడపలో ఇచ్చిన హామీ పరిష్కారం

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీని పరిష్కరించారు ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించాలని గజపతినగరం ఎమ్మెల్యే అప్పల నరసయ్య దృష్టికి తీసుకువచ్చారు ఆయన ఆదేశాల మేరకు ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు పర్యవేక్షణలో ఎలక్ట్రికల్ సిబ్బంది సహాయంతో సమస్యను పరిష్కరించారు దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

కుక్కల బాబోయ్ కుక్కలు

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతి నగరంలోని పలు వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉంది పలు వీధిలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి ఏ క్షణాన ఎవరిపై దాడి చేస్తాయో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు ఎన్నడు లేని కుక్కలు ఒక్కసారిగా గుంపులుగా గ్రామంలో కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకులు మరియు అధికారులు చొరవ తీసుకుని కుక్కలను గ్రామం నుంచి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సియస్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక కుసుమహర్ నాథ్ క్షేత్రంలోని వృద్ధాశ్రమంలో ఎన్‌సియస్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయం అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఆదివారం కుసుమహర్ నగర్ క్షేత్రంలో ఎన్సిఎస్ కుటుంబ సభ్యులు సమకూర్చిన టీవీ రూమును ఆయన ప్రారంభించారు. అమెరికా వాస్తవ్యులు వృద్ధులకు కాలక్షేపం కోసం 75 ఇంచీల టీవీని, సౌకర్యవంతమైన 40 కుర్చీలను సమకూర్చారు. ఈ సందర్భంగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బాలాజీ, ఎన్సిఎస్ ట్రస్ట్ చైర్మన్ నారాయణం శ్రీనివాసరావు మాట్లాడుతూ కుసుమహర్నాథ క్షేత్రంలో వృద్ధులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో టీవీ రూమును ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇదే ఒరవడితో మరిన్ని సేవలను అందించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉదకా కాళీ విశ్వనాథం, ఉసిరికా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి

ఓబిసి మోర్చా నాయకులు ఎలమంచిలి ప్రసాద్

విశాలాంధ్ర - వేపాడ : దేశభక్తితో నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షని బిజెపి ఓబిసి మోర్చ నాయకులు ఎలమంచిలి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం వీరులకు వీరులకు వందనం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని 20 గ్రామాల్లో మట్టి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అమరవీరులను, పుణ్య మాతృమూర్తులను, గౌరవించడం కోసమే నా భూమి నా దేశం కార్యక్రమం, ప్రారంభించడం జరిగిందని, అలాగే అమరవీరుల త్యాగాలను దేశవ్యాప్తంగా పదిలపరచుకోవడం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బాబు వెంటే మేము

మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు

విశాలాంధ్ర - డెంకాడ : నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం బంటుపల్లి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు డెంకాడ మండలం మాజీ జడ్పిటిసి పతివాడ అప్పల నారాయణ సంఘం సురేష్ రవి కిరణ్ శేఖగిరి భాస్కర్రావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వంతో ప్రయత్నించారు....బ్రతికించలేక పోయారు

విశాలాంధ్ర - బొబ్బిలి : ఎవరో తెలియదు,ఎక్కడి వాడో తెలియదు అతని పేరు, ఊరు, పేరు తెలియదు,నిభాషో తెలియదు ఆహారం లేక, స్పృహ తప్పి, లేవలేని నిస్సహాయ స్థితిలో , కదలలేని స్థితిలో సమీపమునకు ఎవరు వెళ్లలేని దుర్గంధం తో అచేతనంగా పడివున్న ఒక్కటక నిర్భాగ్యుడిని 18 రోజుల క్రితం బొబ్బిలి మల్లంపేటకు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చూచి చలించిపోయి, మానవ త్వంతో స్పందించిన కారుణ్య ఫౌండేషన్ చైర్మన్,రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, అతనికి జతగా నిలిచిన ప్రజా శక్తి విలేఖరి జగదీష్ లు ఎలాగైనా ఆ అభాగ్యుడిని బ్రతికించాలని సవర్యలు చేయటం ప్రారంభించారు. ఆహారం అందించారు, బట్టలు మార్చారు, క్షవరం, తలనీలాలు తీసి వేయించారు. రోజు మార్చి రోజు స్నానం చేయించారు. దుర్గంధం లేకుండా ప్రతిరోజు పడక బట్టలు మార్చేరు ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం పాలు, రొట్టె, బిస్కట్లు, ఓఆర్ఎస్, టాటా గ్లోకోస్ ద్రావణం అందిస్తూ వచ్చారు, మధ్యలో ఆర్.ఎం.పి.కి చూపించి శక్తికి ఇంజెక్షన్స్ చేయించారు దాని ఫలితంగా కాస్త శక్తిని పొందకొని చూడటం లేదాం, కూర్చోవడం, స్పందించడం, తనకు తానుగా ద్రాగటం చేసేవాడు అందుకు రోటరీ కార్యదర్శి శ్రీ హరి రోటరీ పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు లు తమ వంతు సేవను ఆ నిర్భాగ్యునికి అందించారు. తదుపరి 18 రోజులు జెసి.రాజు అతని మిత్రులు ఆ నిర్భాగ్యుని బ్రతికించలేమేనన్న ఆశతో మాన వత్వంతో సవర్యలు చేస్తూ వచ్చారు. వీరికి ప్రత్యక్షంగాను ఎన్ని పనులు ఉన్నా ఆ నిర్భాగ్యునికి సేవ చేయటానికి సమయం కేటాయించేవారు. ఆరోగ్యం కుదుట పడితే ఏదైనా అనాధాశ్రమంలో చేర్పించాలి అనుకుంటున్న ఈ సమయంలో అకస్మాత్తుగా నిన్న సాయంత్రం ఆరోగ్యం ఈనెల 7వతేది క్షీణించి మృతి చెందారు.ఈ సేవల్లో చేయూత లేక జెసి.రాజు, శ్రీ హరి, జి.శ్రీనివాస రావు, రామా టాకీస్ సెంటర్ రెడీమేడ్ షాప్ యజమాని, ఆభాగ్యులకు నిత్యం అన్నదానం చేస్తున్న మానవత్వవాది గొల్ల శంకర రావు లోన హాకరం తో రోటరీ వైకుంఠ రథం లో సంత తోట వద్ద ఉన్న స్మశానంలో అనాథ మృత దేహానికి దహన సంస్కారాలు మానవతావాది శంకర రావు నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ఒక నిర్భాగ్యుని బ్రతికించాలని 18 రోజులు మేము ప్రయత్నం చేసామ అవసరమైన సేవను ఆ నిర్భాగ్యునికి అందించాము. అయినా మర ణించాడు. ఏమి చేయలేము...కానీ అతనితో అలవ టైనా తీసుకొని తీసుకొని దుర్గంధ పూరితమైన వాతావరణంలో బాధను అనుభవిస్తూ ప్రాణం పోవటం కంటే ఆవేమి లేకుండా ప్రశాంతంగా చనిపోవడం మంచిది కదా...అనే మేము చేశామని ఆయన తెలియచేసారు. అనాథ మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించిన మానవత వాదులకు పట్టణ ప్రజలు ప్రజాసంఘాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్.కోటలో 67వ రోజుకు చేరుకున్న అన్న క్యాంటీన్ నిత్య అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంతో శృంగవరపు కోట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట, పుణ్యగిరి రోడ్డులో మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం, కోళ్ల పైడితల్లమ్మ ఆశీస్సులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు గురైనప్పటికీ నిర్విరామముగా శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఎస్.కోట తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో 67వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా ఆదివారం మధ్యాహ్నం వచ్చిన 300 మంది పేదవారికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉచితంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఐటీడీపీ సెల్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాస్టర్, కొత్తవలస మండలం టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నియోజకవర్గ వాణిజ్య విభాగం సభ్యులు ఇమంది దేముడుబాబు, కోఆర్డినేటర్ %ంఖీ వీరభద్రపురం పంచాయతీ మాజీ సర్పంచ్ పొట్నూరు వెంకట రత్నాజీ, జడ్పీటీసీ అభ్యర్థి లీక్కాడి అరుణ, ఎస్.కోట మండలం పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, ఎస్.కోట పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి వక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి పెల్లయ్య, క్లస్టర్ కోఆర్డినేటర్ విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, తిమిడి గ్రామ మాజీ సర్పంచ్ రాయవరపు రవి శంకర్, యువత పెదగాడి రాజు, ఎస్.డి.ఆర్, కాపుగంటి గుప్తా, భీమిలి మోహన్ కుమార్, మునసూరు అప్పారావు, రొంగలి రమణ, గొర్లిపోటు ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడ బయలుదేరిన వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం విజయవాడలో జరగనున్న ప్రజా ప్రతినిధుల, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనడానికి పార్వతీపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో పార్వతీపురం పురపాలక సంఘం, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు, మండల కన్వీనర్లు,ఆదివారం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. సోమవారం జగనన్న ఇచ్చే ఆదేశాలు, సూచనలు సలహాలను పాటిస్తూ పార్టీ అభివృద్ధి కోసం అంతా కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో సీఎం గా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని చేసేందుకు వారంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విజయవాడ వెళ్లిన వారిలో 60 మంది బయలుదేరి వెళ్లారు. పురపాలక సంఘం అధ్యక్షులు బోను గౌరీ శ్వరి, ఎంపీపీలు మజ్జి శోభారాణి, బలగ శ్రీరాములునాయుడు, గుడివాడ జగన్, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, బలగ రేవతి, మామిడి బాబ్జి, మరడాన భాగ్యశ్రీ, కొండపల్లి బాల కృష్ణ, చిట్టిరాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీ కృష్ణ,ఇందుపూరి గున్నేశ్వరరావు, ఎస్.జగన్నాథం, వెలిది సాయిరాం, డైరెక్టర్ రులు శనపతి తిరుపతిరావు, వెంకట రమణ, సీతానగరం మండల కన్వీనర్ యు.సురేష్, ఆర్బీ పార్థసారథి, ఉమా, గోపాల్, సింహాచలం తదితరులు వెళ్లారు.

దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు న్యూట్రీషన్ పంపిణీ

విశాలాంధ్ర - చీపురుపల్లి : ప్రభుత్వ ఆసుపత్రి అవరణంలో సహృదయ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిందు పాండేల సహకారంతో, ఆశయ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధితో బాధ పడుతున్న వారికి న్యూట్రీషన్ పంపిణీ చేసారు. ఈరోజు 20 కుటుంబాలకు 700 విలువగల న్యూట్రీషన్ ఆహారం బెల్లం, కందిపప్పు, గోధుమపిండి, రాగులు, శనగపులుసు, పెసలు, సబ్బులు, పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆసుపత్రి చండిప్రియ పాల్గొన్ని మాట్లాడుతూ కష్టాల్లో వున్న వారిని ఆదుకోవాలని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషం అని అన్నారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ సాటి మనిషిని ఆదుకోవడం మానవ జన్మ వరంగా భావించాలని సహాయం చేసే గుణం ప్రతి ఒకరి లో వుండాలని అలాగే మీ ఆరోగ్యం గా జీవించాలని మనుషులలో మానవత్వాన్ని తీసుకురావాలని మా సంస్థ అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అలాగే మాకు సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు అన్ని ఇంకా సహకరించే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈకార్యక్రమంలో ఆశయ సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి రమణ కమ్యూనిటీ కేర్ సెంటర్ మేనేజర్ పద్మావతి. ఆశయ సంస్థ సెక్రెటరీ యం.లక్ష్మణరావు,లక్ష్మణరావు పాల్గొన్నారు.

తాండ్రంగి గ్రామానికి నాలుగు బోర్లు మంజూరు

విశాలాంధ్ర - జామి : మండలంలోని తాండ్రంగి గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక సర్పంచ్ కరక వందన ప్రత్యేక దృష్టి సారించారు. సర్పంచ్ వందన, ఎంపీటీసీ వేదలపు కృష్ణవేణి కోరిక మేరకు స్థానిక మండల పరిషత్ నిధుల నుంచి నాలుగు బోర్లను మంజూరు చేశారు. ఒక్కో బోరుకు 80 వేల రూపాయలు చొప్పున, నాలుగు బోర్లకు 3 లక్షల 20 వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఆదివారం తాగునీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో బోర్లను మండల సోషల్ మీడియా కన్వీనర్ కరక దశరథ్ ఆధ్వర్యంలో వేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులను గుర్తించి తమకు మంజూరు చేసినందుకు ఎంపీపీ అరుణకు, జడ్పిటిసి గొర్లె సరయుకు, మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్ కు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు.

నేడు వెంకటరాయుడుపేటలో సామూహిక నిరాహార దీక్షా కార్యక్రమం

విశాలాంధ్ర - పార్వతీపురం : నియోజక వర్గంలోని పార్వతీపురం మండలంలోని వెంకటరా యుడుపేటలో టిడిపి సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు, దీనికి మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, తెలుగుదేశం పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్రలు హాజరు కానున్నారని మండల నాయకులు తెలిపారు. మన రాష్ట్ర అభివృద్ధి కొరకు నిరంతర శ్రామికుడు, అభివృద్ధి, సంక్షేమం రెండూ రాష్ట్రానికి అందించే ఒకే ఒక్క నాయకుడు ప్రజల హృదయాలలో నిలిచే మనఅధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నిర్వహించే సామూహిక నిరాహారదీక్ష కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు, పార్టీ కుటుంబ సభ్యులందరు తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆధ్యాత్మికతతోనే హిందూ ధర్మ పరిరక్షణ సాధ్యం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఆధ్యాత్మికతతోనే హిందూ ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలుగు పండితులు కె.బాబూరావు మాస్టారు అన్నారు. ధర్మప్రచార వారోత్సవ కార్యక్రమం ఎస్.కోటలోని శ్రీరామ గంగమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పుణ్యగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబూరావు మాస్టర్ మాట్లాడుతూ దేవాదాయ శాఖ సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మాన్ని మరింతగా వ్యాప్తి చేసే కార్యక్రమాలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ వ్యవస్థ, హిందూ ధర్మ పరిరక్షణ వ్యాప్తి చెందాలంటే ఉన్న లోపాలను సవరించుకుని పండితులు, పీఠాధిపతుల ఐక్యమత్యంగా ముందుకు వెళ్ళాల్సి ఉందని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా పుణ్యగిరి దేవస్థానం ఈఓ నాగేంద్ర, చైర్మన్ రామకృష్ణ ఆలయ ప్రధాన అర్చకులు ఆగ్నిహోత్రం రాజగోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది, డైరెక్టర్లు తెలుగు పండితులు కె.బాబూరావు మాస్టారిని దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం బాబూరావు మాస్టారు ధార్మికోపన్యాసం, గీతాలాపన చేశారు.